ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


మంత్రులతో సమావేశంలో సీఎం, డీసీఎం



దేశభక్తి లేదు

● ఆర్‌ఎస్‌ఎస్ నేతలపై మంత్రి ఖర్గే వ్యాఖ్యలు
● గుర్తింపు లేని రహస్య సంఘానికి రూ.కోట్ల నిధులు ఎలా వచ్చాయో నిరూపించాలని సవాల్
● నెహ్రూ, ఇందిరాగాంధీతోనే కాలేదు.. మీతో ఏమౌతుంది..? ● 'నిషేధం' వ్యాఖ్యలపై ప్రతాప్ సింహ ఫైర్

బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రాజ్యాంగాన్ని ఒప్పుకోరు..ఆ సంస్థకు రిజిస్ట్రేషనే లేదు..వారికి దేశభక్తి లేదు..కానీ వందల కోట్ల నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని మంత్రి ప్రియాంక ఖర్గే విరుచుకుపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను ప్రభుత్వ స్థలాల్లో నిర్వహించకుండా కట్టడి చేయాలని ముఖ్యమంత్రికి లేఖరాసిన ఐటీబీటీ శాఖల మంత్రి మరోసారి భగ్గుమన్నారు. సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచంలోనే అత్యంత రహస్య సంఘం అన్నారు. ఇంత గోప్యం ఎందుకన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యుల ప్రసంగాలను నేరుగా ప్రసారం ఎందుకన్నారు. ఈ దేశానికి వారు ఏమి సేవ చేశారని వ్యాఖ్యానించారు. వందేళ్ల అస్థిత్వంలో ఉన్నామని చెప్పుకొనే సంస్థ పది ప్రముఖమైన సేవలను తనకు తెలపాలన్నారు. బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో కీలుబొమ్మ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ లేకుండా బీజేపీ లేదని, మతం లేకుండా ఆర్‌ఎస్‌ఎస్ శూన్యమన్నారు. తాను హిందువులు కానీ హిందూమతానికి వ్యతిరేకం కాదని, కేవలం ఆర్‌ఎస్‌ఎస్ వాటి సిద్ధాంతాలను మాత్రమే వ్యతిరేకిస్తానన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంలో సమానత్వం లేదన్నారు. వారు మన రాజ్యాంగాన్ని ఒప్పుకోరని, మనుస్మృతిని ఇష్టపడతారన్నారు. ఏ సంఘం అయినా ఒక దేశానికి సంబంధించి నిబంధనలు పాటించాలని, ఒక రిజిస్ట్రేషన్ ఉండాలన్నారు. ఇవేవీ లేకుండా వారు దేశభక్తులు ఎలా అవుతారన్నారు. మోహన్ భాగవత్‌కు అంత భద్రత ఎందుకన్నారు. కేంద్ర హోం మంత్రికి ఉన్నంత భద్రత ఎందుకన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్యాన్ చేశారని, చరిత్ర పుటలు తీసి చదవాలన్నారు. సంఘ్ పరివార్‌కు చెందినవారు పటేల్ కాళ్ల మీద పడ్డారన్నారు. మేం కేంద్రప్రభుత్వ నిబంధనలు పాటిస్తామని, మా నమ్మకం జాతీయ పతాకంగా ఉంటుందన్నారు. క్షమాపణలు అడిగినందుకు ఆర్‌ఎస్‌ఎస్ ను బ్యాన్ నుంచి మినహాయింపు చేశారన్నారు.

విస్తరణపైనే..!

● కేబినెట్‌లో మార్పులపై కీలక చర్చలు
● సీనియర్లకు పార్టీ బాధ్యతల అప్పగింత
● సిద్ధంగా ఉండాలన్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే చర్చలు కొనసాగుతున్న తరుణంలో సీఎం విందు హాట్ టాపిక్‌గా మారింది. సోమవారం సీఎం అధికారిక నివాసం కావేరిలో మంత్రులకు ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు మంత్రులు పాల్గొన్నారు. కొందరు ముందస్తు అనుమతితో గైర్హాజరైనట్లు తెలుస్తోంది. ప్రధానంగా రెండున్నరేళ్ల పాలన ముగుస్తున్న తరుణంలో మంత్రివర్గ విస్తరణ తప్పనిసరి కానుందని సీఎం తెలిపినట్లు సమాచారం. కొందరు సీనియర్లకు పార్టీకి సంబంధించి అదనపు బాధ్యతలు అప్పగిస్తామని అందుకు సిద్ధంగా ఉండాలని సూచించినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు కొన్ని నెలల్లో జరగనున్నాయని, ఇప్పటినుంచే కార్యాచరణ జరపాలని సీఎం సూచించినట్లు సమాచారం. స్థానిక సంస్థలు బలోపేతం చేసుకుంటేనే రానున్న ఎన్నికలకు అదనపుశక్తి కానుందని ఆయన వివరించినట్లు తెలుస్తోంది. సీఎం విందుకు సంబంధించి కీలకమైన అంశాలు చర్చించే వేళ సిబ్బంది సహా ఇతరులు లేకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం.

సీఎం కాలిగోటికి సరిపోవు

● ప్రతాప్‌సింహపై ఎమ్మెల్యే ప్రదీప్ అనుచిత వ్యాఖ్యలు



బదిలీలు కావాలంటే సీఎం కుమారుడికి కప్పం కట్టాలని మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ ఆరోపణలపై చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడేవేళ అనుచిత వ్యాఖ్యలు చేశారు. మిస్టర్ అవివేకి, నీవు సిద్దరామయ్య కాలి దుమ్ముకు సరికాదని యతీంద్ర ట్యాక్స్ గురించి మాట్లాడతావా.. అన్నారు. ముందుగా ఆర్ అశోక్ ట్యాక్స్, యత్నాళ్ ట్యాక్స్ గురించి మాట్లాడాలన్నారు. అయితే ప్రదీప్ ఈశ్వర్ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీలు వేరైనా ప్రజాప్రతినిధులపై ఇలాంటి వ్యాఖ్యలు సరికావన్నారు.

నిషేధం అసాధ్యం: ప్రతాప్ సింహ



జవహర్‌లాల్ నెహ్రూ మునిమనవళ్ల పేర్లు పెట్టుకున్న మీరు ఆర్‌ఎస్‌ఎస్ బ్యాన్ చేయడం అసాధ్యమని మంత్రి ప్రియాంకఖర్గేను ఉద్దేశించి మైసూరు మాజీ ఎంపీ ప్రతాప్ సింహ మండిపడ్డారు. మైసూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ఆర్‌ఎస్‌ఎస్ బ్యాన్ చేయడం నెహ్రూ, ఇందిరాగాంధీలతోనే సాధ్యం కాలేదన్నారు. వారి వారసుల పేర్లు పెట్టుకున్న మీతో సాధ్యమా అని ప్రశ్నించారు. ప్రియాంకఖర్గే మూడు నెలలకోసారి ఆర్‌ఎస్‌ఎస్‌ను దూషించి అస్థిత్వాన్ని కాపాడుకుంటున్నారన్నారు. పీయూసీ ఫెయిల్ అయిన ప్రియాంకఖర్గేకు ఎంత చెప్పినా బర్రెపై వాన కురిసినట్టేనన్నారు. ప్రచారం పిచ్చితో ఇలా మాట్లాడుతున్నారన్నారు. ఖర్గే కుటుంబం కలబురగిని నాశనం చేసిందని, మైసూరులో అత్యాచారానికి గురైన గిరిజన బాలిక కుటుంబం కలబురగికి చెందినవారన్నారు. అంతటి దారుణం జరిగితే సొంత ప్రాంతమని కనీసం మాట్లాడలేదన్నారు. మీ నియోజకవర్గ ప్రజలకు ఆధార్‌కార్డులు ఇప్పించే యోగ్యత లేదన్నారు. ఎస్సై నియామకాల అవినీతి, బిట్‌కాయిన్‌ల గురించి ఎన్నో చెప్పారని వాటిని రుజువు చేయలేకపోయారన్నారు. పీయూసీ ఫెయిల్ అయిన ప్రియాంక కర్గే యాని మేషన్ సర్టిఫికెట్‌తో తిరుగుతున్నారన్నారు. నువ్వు ఎలాగు చదవలేదు, మీ జిల్లాకు చెందిన పిల్లలకైనా చదివే వాతావరణం కల్పించాలన్నారు. రెండున్నరేళ్లుగా మీ శాఖలో ఏం సాధించారో చెప్పగలరా..? అంటూ సవాల్ విసిరారు. ఆర్‌ఎస్‌ఎస్ డ్రెస్‌లో ఉన్న ఎమ్మెల్యే మునిరత్నను డీసీఎం ఏ నల్లటోపి అంటూ పిలిచారని, అదే తరహాలోనే ఓ గుంపులో మంత్రి జమీర్ అహ్మద్ కూర్చుంటే ఏ తెల్లటోపీ ఇక్కడికి రా అనగలవా అని ప్రశ్నించారు. మా పార్టీ నాయకురాలు కుసుమాకు అవసరమైతే ఎమ్మెల్సీ లేదా రాజ్యసభకు పంపండి. కానీ ఎమ్మెల్యేను ఎందుకు వేధిస్తారని ప్రశ్నించారు. 2028కి డీకే శివకుమార్ కూడా జాబ్‌లెస్ అవుతారన్నారు.

దళితుడిగా అయోగ్యుడు: చలవాది

కాంగ్రెస్ పాలనలో దళితులకు అన్యాయం జరుగుతున్నా కనీసంగా స్పందించని ప్రియాంకఖర్గే దళితుడు అని చెప్పుకొనేందుకు అర్హుడు కాదని పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి మండిపడ్డారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ఖర్గే ప్రచారం కోసం నోటికొచ్చినట్లు మాట్లాడతారన్నారు. చిత్రదుర్గ ఎంపీ గోవింద కారజోళ స్పందిస్తూ పిల్లలకు మంచి బుద్ధులు నేర్పాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియాగాంధీలకు సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ పార్టీ కాదని, నేత మోహన్‌భాగవత్ నాయకుడు కాదని, మీరు ఎదుర్కోవాల్సింది బీజేపీని మాత్రమేనన్నారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీల మెప్పుకోసం నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు క్షమించరన్నారు. దేశభక్తికోసం పాటుపడిన ఆర్‌ఎస్‌ఎస్‌కు వందేళ్లు నిండిందని, ఇటువంటి సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు అసందర్భమన్నారు. మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ మాట్లాడుతూ ప్రియాంకఖర్గే బుద్ధి ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదన్నారు. ఏం మాట్లాడుతున్నారో తెలుసుకోరన్నారు. అప్రస్తుతమైన మాటలు మినహా, ఐటీబీటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో బెంగళూరు విప్లవం తరహాలో అభివృద్ధి చెందుతోందని వాటి గురించి మాట్లాడాలన్నారు. కాగా ఆర్‌ఎస్‌ఎస్ గురించి బహిరంగ చర్చకు రాగవలవా..? అంటూ సీటీ రవి సవాల్ విసిరారు.



ఖర్గే వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో చర్చ

మంత్రి ప్రియాంకఖర్గే వ్యాఖ్యలపై కాంగ్రెస్ వర్గాలలోనే చర్చ మొదలైంది. తరచూ వివాదాలకు కేంద్రంగా ప్రియాంకఖర్గే వ్యవహరిస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రభుత్వాన్నిన్న తలవంపులు చేసేలా ఉందని కొందరు కాంగ్రెస్ సీనియర్లు చర్చించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ కీలకులు, సీఎం, డీసీఎం కూడా ఎటువంటి కట్టడి చేసే పరిస్థితి లేకుండా పోయిందని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు కావడంతో అందరూ మౌనంగా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేఎన్ రాజణ్ణ దశాబ్దాల కాలంగా అవినీతికి అవకాశం ఇవ్వలేదని, ముక్కుసూటిగా ఉండేవారన్నారు. కేవలం ఓటుచౌర్యంపై అభిప్రాయం వ్యక్తం చేసినందుకే మంత్రి పదవినుంచి తొలగించారని చర్చించుకుంటున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ విషయంలో ప్రియాంక ఖర్గే వ్యాఖ్యలు ఎక్కడికి దారితీస్తాయోనని ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది.

కిత్తూరు రాణి చన్నమ్మను స్మరించుకోవాలి

● యువతకు సీఎం సిద్దరామయ్య పిలుపు


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బ్రిటీషువారిపై పోరాటం చేసిన కిత్తూరు రాణి చన్నమ్మ నేటి యువతకు ఆదర్శప్రాయులని, ఆమె ధైర్యసాహసాలు నేటి యువత స్మరించుకోవాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. కన్నడ సంస్కృతిశాఖ, బెళగావి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టిన కిత్తూరు ఉత్సవం 2025కు విధాన సౌధ వద్ద సోమవారం ఆయన లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథానికి సీఎం పచ్చజెండా చూపారు. విధానసౌధ ముందు భాగాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిత్తూరు ఎమ్మెల్యే బాబాసాహెబ్ పాటిల్, జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్‌షిండేతోపాటు పలువురు పాల్గొన్నారు. పలు కళాబృందాలు ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. రాణి చన్నమ్మ వేషధారణలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.


వీరనారి కిత్తూరురాణి చన్నమ్మ వేషధారిణి

డ్రాప్ చేస్తామని.. రేప్ చేశారు..!

● యువతి ఫిర్యాదుతో నిందితుల అరెస్ట్

7


ప్రధానికి జ్ఞాపిక అందజేస్తున్న మాజీ సీఎం యడియూరప్ప

ప్రధానితో యడియూరప్ప భేటీ

బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఢిల్లీలో మాజీ సీఎం, బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడు యడియూరప్ప సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మోదీకి ఆయన దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బిహార్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ ఎన్నికల కమిటీ సమావేశంలో అప్ప పాల్గొన్నారు.

దొంగ ఓట్లతోనే బీజేపీకి అధికారం

● కల్యాణ కర్ణాటక ఇన్‌చార్జ్ గోపీనాథ్ పళనియప్పన్


మీడియాతో మాట్లాడుతున్న గోపీనాథ్ పళనియప్పన్

బళ్లారి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ దొంగ ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చిందని, ఆ నాయకులకు ప్రగల్భాలు పలకడం అలవాటు అయ్యిందని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీ, కల్యాణ కర్ణాటక జిల్లాల ఇన్‌చార్జ్ గోపీనాథ్ పళనియప్పన్ వ్యాఖ్యానించారు. బీజేపీ ఓటు చౌర్యంపై కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం పళనియప్పన్ బెల్గాం, బళ్లారి, రాయచూరు జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బళ్లారి కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లు సృష్టించి మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసి వారికి కావలసిన పార్టీలను ఎన్నుకునే అవకాశం ఉండాలన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. బీజేపీ నాయకులకు ప్రగల్భాలు పలకడం అలవాటు అయ్యిందన్నారు. ప్రజలు దొంగ ఓట్లు పడకుండా జాగ్రత్త పడాలని కోరారు. మహారాష్ట్రలో కూడా ఉన్న ఓట్ల కన్నా 40 లక్షల ఓట్లు అధికంగా ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. దొంగ ఓట్లపై ప్రజలే ముందుకు వచ్చి దేశాన్ని కాపాడుకోవాలన్నారు.

హాప్‌కామ్స్..!

● తగ్గిపోతున్న హాప్‌కామ్స్ దుకాణాలు
● రాష్ట్రవ్యాప్తంగా సగానికి పైగా మూత
● మాల్స్ దెబ్బకు తగ్గిన కొనుగోళ్లు
● సగం మంది ఉద్యోగులు ఖాళీ
● అన్నదాతకూ తప్పని ఆవేదన


బెంగళూరులో మూతబడ్డ ఓ హాప్‌కామ్స్ దుకాణం

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత పండించిన వస్తువులను దళారుల బెడద లేకుండా విక్రయించడం ద్వారా సంపూర్ణ లాభాలను అందించే లక్ష్యంతో ఉద్యానవనశాఖ ఏర్పాటు చేసిన 'హాప్‌కామ్స్' రోజురోజుకు తగ్గిపోతున్నాయి. కారణాలు ఏవైనా అన్నదాతకు లాభాలు సమకూరుస్తామని ఇటు రాష్ట్రం, అటు కేంద్రప్రభుత్వాలు ప్రతి వేదికపైనా గొప్పలు పోతారు. కానీ ఉన్న వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది సజావుగా కొనసాగించే ఆలోచనలు మాత్రం చేయడం లేదు. అన్నదాత ఆదాయం రెట్టింపే లక్ష్యమని కేంద్రప్రభుత్వం కొన్నేళ్లకాలంగా బహిరంగ ప్రచారం చేస్తోంది. ఇక రాష్ట్రప్రభుత్వం అన్నదాతకు అన్యాయం జరిగితే అంగీకరించే ప్రసక్తే లేదని గొప్పలు చెబుతుంది. ఉద్యానవన శాఖకు భారీగా నిధులు కేటాయించామని రాష్ట్రప్రభుత్వం చెబుతున్నా సంబంధిత మంత్రి ఏడాదిలో ఓసారి కూడా తనశాఖ పరిధిలోని ప్రగతిని విడుదల చేయలేదు. రెండున్నరేళ్లుగా ఉద్యానవన శాఖ మంత్రిగా కొనసాగుతున్న ఎస్‌ఎస్ మల్లికార్జున దావణగెరె జిల్లా రాజకీయాలకే పరిమితమయ్యారు ఏడాదికి రెండుసార్లు లాల్‌బాగ్ ప్రదర్శనలో మినహా మరెక్కడా ఆయన శాఖకు సంబంధించిన కార్యక్రమాలు కూడా కనిపించడం లేదని ఉద్యానరైతులు మండిపడుతున్నారు.

● హాప్‌కామ్స్ ప్రధాన కార్యాలయం లాల్‌బాగ్ హాప్‌కామ్స్ గేట్ వద్ద ఉంది. అక్కడనుంచే కార్యకలాపాలు సాగుతున్నాయి. ఉద్యానవనశాఖ తెలిపిన వివరాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 557 హాప్‌కామ్స్ స్టాల్స్ ఉండేవి. ప్రస్తుతం వాటిసంఖ్య 416కు తగ్గిపోయింది. 141 హాప్‌కామ్స్ స్టాల్స్ క్రమేపీ వ్యాపార లావాదేవీలు లేకపోవడం, తగినంతమంది ఉద్యోగుల కొరతతో మూతపడ్డాయి. మరో వందకు పైగా దుకాణాలు అరకొరగానే నడుస్తున్నా యి. దీంతో సగానికి పైగా హాప్‌కామ్స్ మూత దిశగా ఉన్నట్లయ్యింది. జనసందడి లేకపోవడం, వ్యాపార వ్యవహారాలు తగ్గుతుండడం కూడా మూతపడేందుకు కారణంగా ఉంది. సంస్కరణ విధానం లేకుండానే పండ్లు, కూరగాయలు విక్రయిస్తుండడం ద్వారా హాప్‌కామ్స్‌లో వస్తువులకు నాణ్యత లేకుండాపోతోందనే విమర్శలు ఉన్నాయి.

ఆన్‌లైన్ దెబ్బతో విలవిల

ఒకప్పుడు బెంగళూరు వంటి ప్రధాన నగరమే కాకుండా ప్రతిచోటా హాప్‌కామ్స్‌కు ఆదరణ ఉండేది. తాజా కూరగాయలు, పండ్లు చౌకధరకే లభిస్తాయని ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ వ్యాపారాలు పెరిగాయి. అంతకంటే మాల్స్ సంస్కృతి తాలూకా కేంద్రాలకు విస్తరించింది. ఎప్పుడు వెళ్లినా తాజా వస్తువులతోపాటు ఇంటికి అవసరమైన ఇతరత్రా దినుసులు ఒకేచోట లభిస్తుండడంతో మాల్స్‌కు వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. పైగా ఆన్‌లైన్‌లో కేవలం అరగంటలోనే కోరుకున్న పండ్లు, కూరగాయలు డోర్ డెలివరీ చేసే ఎన్నో సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని హాప్‌కామ్స్ ఎదుర్కొనే పరిస్థితి లేకుండా పోయింది. ఇటువంటి కారణాలతోనే హాప్‌కామ్స్ ఉనికిని కోల్పోతున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో అటు ఉద్యోగులు ఉపాధి కోల్పోతుండగా, రైతులు నష్టాలకే అమ్ముకోవాల్సి వస్తోందిని వాపోతున్నారు.

బెంగళూరులోనే అత్యధికం

రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ హాప్‌కామ్స్ సెంటర్లు ఉండేవి. పలు చోట్ల అవి మూతబడ్డాయి. అయితే బెంగళూరు నగర వ్యాప్తంగా 266 హాప్‌కామ్స్ కేంద్రాలు ఉండేవి. ఇందులో ఏకంగా 88 కేంద్రాలు మూతపడ్డాయి. మైసూరులో 49 కేంద్రాలలో 17 మూతపడగా, బాగల్కోటెలో 3, బళ్లారిలో 2 మూతపడ్డాయి. బెళగావిలో 11 కేంద్రాలకుగాను 3 మూతపడగా, బీదర్‌లో 4కుగాను 2, చిత్రదుర్గలో 3, ధారవాడ, హాసన్‌లలో 1 మూతపడ్డాయి. మండ్యలో 8, మంగళూరులో 2, విజయపురలో 6, తుమకూరులో 4 హాప్‌కామ్స్ కేంద్రాలు మూతపడ్డాయి. సుదీర్ఘకాలంగా లాభాలబాటలో నడిచిన హాప్‌కామ్స్ సంస్థ ఇటీవల కొన్నేళ్లుగా నష్టాలు ఎదుర్కొంటోంది. కొవిడ్ కాలం నుంచి వరుసగా నష్టాలు వచ్చినట్లు ఆడిట్ ద్వారా తేలింది. 2024-25కు సంబంధించిన నివేదిక రావాల్సి ఉంది. వీటన్నింటికంటే హాప్‌కామ్స్ కేంద్రాలు కొనసాగించడం పెనుసవాల్‌గా మారుతోంది. హాప్‌కామ్స్ ప్రారంభించినప్పుడు వాటికి అనుగుణంగా ఉద్యోగులను నియమించుకున్నారు. ఇలా 782 మంది హాప్‌కామ్స్‌లలో పనిచేసేవారు. కాలానుగుణంగా రిటైర్డు కావడం లేదా ఇతరత్రా కారణాలతో వదులుకోవడం కొనసాగింది. ఏకంగా 344 పోస్టులు కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 438మంది మాత్రమే పని చేస్తున్నారు.

1955లోనే శ్రీకారం

రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను సామాన్య ప్రజలకు తాజాగా అందుబాటులో ఉంచాలనే సదుద్దేశంతో హార్టికల్చరల్ ప్రొడ్యూసర్స్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ అండ్ ప్రాసెసింగ్ సొసైటీ (హాప్‌కామ్స్)ను ఉద్యానవనశాఖ ద్వారా ఏర్పాటు చేశారు. బెంగళూరుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 1955లో హాప్‌కామ్స్‌కు శ్రీకారం చుట్టారు. ప్రారంభంలో హాప్‌కామ్స్‌కు ఎనలేని ఆదరణ ఉండేది. సాధారణ మార్కెట్ ధరలకంటే కొంత తక్కువ రేట్లతో పండ్లు, కూరగాయలు లభించేవి. దీనికితోడు కృత్రిమమైన రసాయనాలు చల్లడం వంటి చర్యలు ఉండేవి కాదు. పైగా రైతునుంచి మార్కెట్‌కు చేరేసరికి ఎంతమంది చేతులు మారితే అంతమందికి కమీషన్ ఇవ్వాల్సి ఉండేది. కానీ హాప్‌కామ్స్‌లో ఎవరికీ కమీషన్ ఇవ్వాల్సిన అవసరం లేకపోవడంతో మార్కెట్ ధరలకంటే చౌకగా లభించేవి.

ధర్మవరం బాలికలు భళా..!

ఫ్లోర్‌బాల్ క్రీడలో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

నవంబరులో సింగపూర్‌కు విద్యార్థినులు

మున్సిపల్ పాఠశాల బాలికలకు ఆర్థిక కష్టాలు



సింగపూర్‌లో జరిగే పోటీలకు ఎంపికైన ధర్మవరం విద్యార్థినులు

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే సాధించ లేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు ధర్మవరం బాలికలు. అరకొరగా ఉన్న సౌకర్యాలనే అందిపుచ్చుకు అద్భుత ప్రతిభా పాటవాలు కనబరు స్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో ఫ్లోర్‌బాల్ క్రీడల్లో అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. మొదట రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సంపాదించి.. అక్కడ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అక్కడ కూడా సత్తాచాటి ఏకంగా సింగపూర్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు జాతీయ జట్టులో 10 మంది చోటు సంపాదించుకున్నారు.

ఇదీ ఫ్లోర్‌బాల్ క్రీడా నేపథ్యం..

ఫ్లోర్‌బాల్ క్రీడలో మొత్తం 11 మంది ఉంటారు. క్రీడలో ఆడేవారు ఆరుగురు ఉండగా.. మిగిలిన ఐదుగురు అదనంగా ఉంటారు. ఈ ఆటకు 30 నిమిషాలు కేటాయిస్తారు. ఇందులో ఎక్కువ గోల్స్ చేసిన జట్టును విజేతగా నిర్ణయిస్తారు. ఈ క్రీడ ఇండోర్ స్టేడియంలో ఆడతారు.

అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ

ఈ క్రీడకు ధర్మవరం ప్రాంతంలో పెద్దగా ప్రాధాన్యం లేదు. కొన్ని నెలల నుంచి ఈ క్రీడకు బీఎస్ఆర్ మున్సిపల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రాధాన్యం ఇచ్చి బాలికలను ప్రోత్సహించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలతోనే శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం, పీఈటీ, పీడీలు ప్రత్యేక దృష్టి సారించి బాలికలకు ప్రతిరోజూ ఫ్లోర్‌బాల్ ఆటలో మెలకువలు నేర్పించారు. దీంతో మూడునెలల కాలంలోనే బాలికలు మంచి ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఆగస్టు మొదటి వారంలో అనంతపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ధర్మవరానికి చెందిన 20 మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తర్వాత గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సత్తాచాటి.. జాతీయస్థాయి పోటీలకు 13 మంది ఎంపికయ్యారు. వీరు బిహార్‌లో సెప్టెంబరు 1నుంచి 10వతేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఇందులో కూడా సత్తాచాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున 10 మంది ఎంపికయ్యారు. వీరు నవంబరులో సింగపూర్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారు. సింగపూర్‌కు వెళ్లడానికి ఒక్కో బాలికకు రూ.2లక్షల దాకా ఖర్చు అవుతుంది. ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ తరఫున రూ.50వేలు ఇస్తారు. మిగిలిన మొత్తం తల్లిదండ్రులు లేదా దాతల సహకారంతో డబ్బులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మున్సిపల్ స్కూలులో చదువుతున్న ఈ చిన్నారులకు ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. పాస్‌పోర్టు కోసం ఈనెల 30,31తేదీలలో బాలికలు విజయవాడ వెళ్లనున్నారు. నవంబరు మొదటి వారంలో 10 రోజుల పాటు ఢిల్లీలో ఫ్లోర్‌బాల్ క్రీడలో శిక్షణకు వెళ్లనున్నట్టు పీఈటీ తెలిపారు.

పీఈటీ కృషి ఎనలేనిది

ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ కనుముక్కల లక్ష్మీనారాయణ బాలికల విజయానికి చేసిన కృషి ఎనలేనిది. ఆయన తాడిపత్రి నుంచి బదిలీపై జూన్‌లో ధర్మవరం వచ్చారు. ఫ్లోర్‌బాల్‌పై బాలికలకు ఉన్న మక్కువ చూసి ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా క్రీడను ఎలా ఆడాలో చూపించి శిక్షణ ఇచ్చారు. పాఠశాలలో ఈ క్రీడకు కావాల్సిన ఆట వస్తువులు లేవు. దీంతో పీఈటీ తన సొంత ఖర్చులతో బ్యాట్లు, బాల్లు ఇతర వస్తువులను కొనుగోలు చేసి శిక్షణ ఇచ్చారు.

అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణిస్తారు



నేను ఈ ఏడాది జూన్‌లో సాధారణ బదిలీల్లో తాడిపత్రి నుంచి ధర్మవరం పీఈటీగా వచ్చా. విద్యార్థినిలకు ఏ క్రీడలపై మక్కువ ఉందో తెలుసుకున్నా. పాఠశాలలో ఐపీబీ ప్యానల్ ద్వారా ఫ్లోర్‌బాల్ క్రీడ ఎలా ఆడాలో చూపించి క్రీడా సామాగ్రిని సమకూర్చి నేర్పించా. దీంతో నేరుగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్లా. అక్కడ ప్రతిభ కనబరచి ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున మా పాఠశాల నుంచే 10 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. అంతర్జాతీయ పోటీల్లో కూడా సత్తాచాటి పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తారని ఆశిస్తున్నా.

- కనుముక్కల లక్ష్మీనారాయణ, పీఈటీ, బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ధర్మవరం

అంతర్జాతీయ పతకమే లక్ష్యం



నేను 9వ తరగతి చదువుతున్నా. ఫ్లోర్‌బాల్ క్రీడ టీవీల్లో చూడమే కానీ ఎప్పుడూ ఆడలేదు. ఈ ఏడాది మా పాఠశాలకు బదిలీపై వచ్చిన పీఈటీ లక్ష్మీనారాయణ సార్ ప్రోత్సాహంతో తక్కువ కాలంలో ఫ్లోర్‌బాల్ ఆట నేర్చుకున్నా. సింగపూర్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యా. అంతర్జాతీయ పతకం సాధించడమే నా లక్ష్యం.

- బండారు కీర్తన, 9వ తరగతి

ఫ్లోర్‌బాల్ క్రీడ అంటే ఇష్టం



ఫ్లోర్‌బాల్ క్రీడ అంటే చాలా ఇష్టం. పాఠశాలలో ఇంతకు ముందెన్నడూ ఆడలేదు. ప్రస్తుతం ఐపీబీ ప్యానల్ ద్వారా పీఈటీ లక్ష్మీనారాయణ సార్ శిక్షణ ఇచ్చారు. నేరుగా ఆగస్టులో గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటా. తరువాత బీహార్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ సత్తాచాటి మా పాఠశాలకు పేరుప్రతిష్ఠలు తీసుకువస్తా.

- నందిని, 9వ తరగతి

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా



నేను 9వ తరగతి చదువుతూనే క్రీడలకు సమయాన్ని కేటాయిస్తున్నా. ఫ్లోర్‌బాల్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించా. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం. ఈ క్రీడలో పీఈటీ లక్ష్మీనారాయణ సార్ కృషి ఎంతో ఉంది. ఆయన సొంత ఖర్చులతో మాకు కావాల్సిన బ్యాట్లు, బాల్లు తదితర వాటిని సమకూర్చారు. ఆయన ఆశయం మేరకు అంతర్జాతీయ పోటీల్లో కూడా రాణిస్తాం.

- గౌతమి, 9వ తరగతి

గ్రేడ్ల కుదింపుతో ఉద్యోగోన్నతులు

● బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత



సీఎం, డీసీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఐదు నుంచి నాలుగు గ్రేడ్లుగా కుదింపుతో పంచాయతీ కార్యదర్శులకు ఒకేసారి ఉద్యోగోన్నతి కల్పించే అవకాశం ఉంటుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పంచాయతీ గ్రేడ్ల కుదింపుపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల కోరిక మేరకు నాలుగు గ్రేడ్లుగా కుదించారని, దీనివల్ల పాలన సౌలభ్యం కలగడంతోపాటు ఉద్యోగోన్నతులు కూడా త్వరగా వస్తాయన్నారు. పెనుకొండ, పరిగి మండలాలకు చెందిన పలువురికి మంత్రి సీఎం సహాయనిధి చెక్కులు అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, సూరి, గిరి, నాగార్జున, నారాయణస్వామి పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక

మంత్రి సవిత సమక్షంలో ఎనిమిది మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాకప్పి ఆహ్వానించారు. వీరంతా పరిగి మండలం పి.నర్సాపురం పంచాయతీలోని ఎస్.కొత్తపల్లి, బీరేపల్లి గ్రామాలకు చెందిన వారు.

అర్చక సమస్యల పరిష్కారానికి కృషి

దేవదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి

ఏపీ అర్చక సమాఖ్య జిల్లా నూతన కమిటీ ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల రెడ్డి

అనంతపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అర్చకుల సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయ కల్యాణ మండపంలో ఏపీ అర్చక సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలరెడ్డి మాట్లాడుతూ... పలువురు అర్చకులకు తల్లికి వందనం పడలేదని తన దృష్టికి వచ్చిందన్నారు. సమస్యను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి తల్లికి వందనం వర్తించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం రూ.5వేలు ఉన్న డీడీఎన్ఎస్‌ను రూ.10వేలకు పెంచి అర్చక పురోహితుల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. అనంతరం ఏపీ అర్చక సమాఖ్య జిల్లా నూతన కమిటీ ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పుల్లమాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా హనుమంతరాముడు, సహాయ కార్యదర్శులుగా తిమ్మరాజు, కడప మధుసూదన్, సంయుక్త కార్యదర్శిగా మారుతి, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్, బాలాజీ, పవన్‌కుమార్, గౌరవ సలహాదారులుగా అనిల్‌కుమార్, మహేష్‌శర్మ, మురళి, ఉసేనప్ప, రాము, పామిడి రాములతోపాటు మొత్తం 30 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షులు పూజారి భీమప్ప, పార్థసారథి, గరుడాచార్యులు, ద్వారకానాథాచార్యులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి: ఎస్పీ



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా సత్వర న్యాయం చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదిదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించ రాదని, దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా భావించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ సమస్యలపై 75 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశువులు రాకుండా కంచె

అనిమల్ ట్రాక్ పాసింగ్‌తో ప్రమాదాలు

ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్ రెడ్డి



పవన్‌కుమార్‌రెడ్డి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపైకి పశువులు రాకుండా కంచె ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. అనిమల్ ట్రాక్ పాసింగ్‌తో పెనుప్రమాదాలు జరుగుతాయని వివరించారు. రైలు పట్టాలు తప్పే అవకాశం కూడా ఉండవచ్చు అన్నారు. సోమవారం అనంతపురం రైల్వే స్టేషన్ ఆవరణంలోని ఆర్పీఎఫ్ స్టేషన్‌లో ఆయన పలు విషయాలను వెల్లడించారు. ప్రధానంగా పశువుల ట్రాక్‌పాస్ ద్వారా చాలా ప్రమాదం అన్నారు. రైల్వేట్రాక్ పరిసర ప్రాంతాల్లో పచ్చిక ఉండటం, తినడానికి వచ్చిన ఆవులు, గేదెలు ప్రమాదవశాత్తు మృత్యువాత చెందుతున్నాయన్నారు. ఈ మధ్య ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ఆవులను, గేదెలను పాలు పిండుకున్న తరువాత మేతకోసం రైల్వే ట్రాక్ సమీప ప్రాంతాలకు తోలుతుండటంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొందని అన్నారు. రైలు వచ్చే సమయంలో ట్రాక్ దాటుతుండటంతో ప్రమాదవశాత్తు ఢీకొని మృతి చెందుతున్నాయని అన్నారు. ఇలాంటి సందర్భంలో రైలు పట్టాలు తప్పి ప్రమాదం చోటు చేసుకొనే అవకాశం ఉందన్నారు. దీంతో జిల్లా కేంద్ర పరిసర ప్రాంతాలైన రైల్వే స్టేషన్ నుంచి రాజీవ్ కాలనీ బ్రిడ్జి వరకు.. అటు ప్రసన్నాయపల్లి గేట్ వరకు జంతువులు ట్రాక్ వైపు రాకుండా కంచె ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పశువుల యజమానులు ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో జంతువులను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడటంతో పాటు రైల్వే నిబంధనల మేరకు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నకిలీ మద్యం వేట

ములకలచెరువు వ్యవహారంతో ఎక్సైజ్ అధికారుల్లో కలవరం

జిల్లాలో విస్తృతంగా తనిఖీలు

నకిలీ మద్యం తయారీదారుల కదలికలపై నిఘా



కిరెకెరలో మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఈఎస్

పుట్టపర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పక్కనే ఉన్న అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ వ్యవహారం ఇటీవల వెలుగుచూడడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో నకిలీ మద్యం వేట మొదలెట్టారు. మద్యం దుకాణాలు, బార్లలో తనిఖీలు ముమ్మరం చేశారు. ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంతో జిల్లాకి సంబంధాలున్నాయా, తయారీలో ఎవరి పాత్రయినా ఉందా.. అన్న కోణాల్లో ఎక్సైజ్ అధికారులు బృందాలుగా ఏర్పడి, తనిఖీలు చేపడుతున్నారు. నకిలీ మద్యం వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయడంతో జిల్లాలో ఎక్సైజ్ శాఖ అప్రమత్తంది. మద్యం దుకాణాల్లో మద్యం లేబుళ్లు, నిల్వలు, అమ్మకాలపై తనిఖీలు చేపడుతున్నారు. శాంపిళ్లు సేకరిస్తున్నారు. ప్రధానంగా ములకలచెరువు సమీప మండలాలైన కదిరి, తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, నంబులపూలకుంట, అమడగూరు మండలాల్లో బార్లు, మద్యం దుకాణాలతోపాటు బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నారు. కొన్ని బెల్ట్ దుకాణాల్లో చీప్ లిక్కర్‌ను బ్రాండెడ్ బాటిళ్లలో పోసి, విక్రయిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో గుర్తించినట్లు తెలుస్తోంది. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు దారులున్న నేపథ్యంలో అడ్డుకట్ట వేసేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. ఆరునెలల క్రితం హిందూపురంలో తొలిసారిగా నకిలీ మద్యం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. పదిరోజుల క్రితం ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ గుట్టు రట్టవడంతో జిల్లాపై ఎక్సైజ్ శాఖ రాష్ట్ర అధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో తనిఖీలు విస్తృతంగా చేస్తున్నారు. జిల్లాలో 87 ప్రైవేటు, తొమ్మిది కల్లుగీత కార్మికుల మద్యం దుకాణాలతో కలిసి 96 ఉన్నాయి. 11 బార్ అండ్ రెస్టారెంట్లను మంజూరు చేసింది. ఈసారి కొందరు రాజకీయ నాయకులు మద్యం వ్యాపారుల అవతారం ఎత్తారు. దీంతో ఎక్సైజ్ శాఖ ప్రేక్షక పాత్ర వహించాల్సి వస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ వెనుక రాజకీయ మూలాలున్న నేపథ్యంలో జిల్లాలో ఇద్దరు పెత్తనంతో నడుస్తున్న వాటిలో నకిలీ మద్యం విక్రయిస్తున్నారా.. అన్న కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారను. గతంలో నకిలీ మద్యంతో పట్టుబడినవారి కదలికలపై నిఘా పెట్టారు. ఇటీవల తనకల్లు మండలం ఎర్రబల్లికి చెందిన వడ్డే శ్రీరాములు మానసిక రుగ్మతతో బాధపడుతూ వీధుల్లో తిరుగుతూ మరణిస్తే.. మద్యం సేవించి చనిపోయినట్లు వైసీపీ ప్రచారం చేయడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు

ములకలచెరువు నకిలీ మద్యం తయారీ లింకులు జిల్లాలో బయటపడకపోయినా విస్తృతంగా తనిఖీ చేస్తున్నాం. సమీప మండలాల్లోని మద్యం దుకాణాల్లో తనిఖీ చేసి, శాంపిళ్లు సేకరించాం. కర్ణాటక సరిహద్దుల్లోని చెక్‌పోస్టులతోపాటు మద్యం అమ్మకాలపై నిఘా పెట్టాం.

- గోవిందునాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

పత్తికి మద్దతు ధర: జేసీ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ తెలిపారు. సోమవారం కర్నూలు పర్యటనలో ఉన్న జేసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... నోటిఫైడ్ చేసిన మార్కెట్ కమిటీలలో పత్తి కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు మధ్య రకం రూ.7,710, పొడవు పింజ రకం రూ.8,110 లభిస్తుందన్నారు. తేమ 8 శాతం లేక అంతకంటే తక్కువ నుంచి 12 శాతం వరకు మాత్రమే ఉండాలన్నారు. 8 శాతం నుంచి 12శాతం వరకు పెరిగిన ప్రతి ఒక్క శాతానికి ఒక శాతం చొప్పున మద్దతు ధరలో తగ్గింపు ఉంటుందన్నారు. 12 శాతం కంటే ఎక్కువ వచ్చిన పత్తిని కొనుగోలు చేయరని అన్నారు. రైతులు తప్పనిసరిగా వాడుకలో ఉన్న వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ నెంబర్లతో అనుసంధానం చేసుకోవాలన్నారు. తాడిపత్రి మార్కెట్‌యార్డు కార్యదర్శి ఫోన్ నెంబర్-9182361482, గుత్తి మార్కెట్‌యార్డ్ కార్యదర్శి - 9182361475ను రైతులు సంప్రదించాలని సూచించారు. వీసీలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో వీసీలో మాట్లాడుతున్న జేసీ

న్యాయవ్యవస్థ సమస్యలకు పరిష్కారం వెతకాలి

ప్రముఖ న్యాయవాది తీస్తా సెతెల్వాద్



సెమినార్‌లో మాట్లాడుతున్న తీస్తా సెతెల్వాద్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థ సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకాలని ప్రముఖ న్యాయవాది, రచయిత, సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ పేర్కొన్నారు. ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమాన్ని జడ్పీ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరమానప్ప అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, రచయిత, సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వీటికి పరిష్కారమార్గాలు ఏమిటన్నది పరిశీలించాల్సిన అవసరం ఉందన్నా రు. కింది స్థాయి కోర్టుల్లోనే పరిష్కారం కావాల్సిన చాలా కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు తీసుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. కోర్టుల్లో పని చేసే న్యాయవాదులనే జడ్జిలుగా ఎన్నుకోవడం ద్వారా కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. హక్కుల కోసం పోరాడే వారిపై కేసులు బనాయించడం. చిన్న చిన్న కేసులకు సైతం బెయిల్ రాకుండా కాలయాపన చేస్తుండటం ప్రస్తుతం చూస్తున్నామన్నారు. న్యాయవ్యవస్థలో దళిత, గిరిజనులతో పాటు మహిళల భాగస్వామ్యం బాగా తగ్గిపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ఆల్‌ఇండియా బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సతీష్, పలువురు ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురంరూరల్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రామవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 67టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాలు సిగ్గు పడాలి

అనంతపురం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పురుషులతో మహిళలకు సమాన హక్కులు కల్పించలేని ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలని ఐద్వా అఖిల భారత ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలకు సోమవారం అనంతపురంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి క్లాక్‌టవర్ కూడలి మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాదిమంది మహిళలు ఐద్వా జెండాలు, ఐద్వా పోరాటయోధుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. 16వ మహాసభల సూచికగా 16 పెద్ద జెండాలతో కార్యకర్తలు ఉరుము కళాకారుల విన్యాసాలు, కోలాట ప్రదర్శనల నడుమ కదిలారు. అనంతరం లలితకళా పరిషత్‌లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన సభనునిర్వహించారు. ఈ సభకు మరియం ధావలేతోపాటు ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు శ్రీమతి టీచర్, కోశాధికారి పుణ్యవతి, సామాజిక వేత్త తీస్తా సెతల్వాద్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

కేంద్రం విధానాలను ప్రశ్నించలేని సీఎంలు

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే మాట్లాడుతూ తమ మద్దతుతో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా, వారి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించలేని స్థితిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఉన్నారని విమర్శించారు. ఆహార భద్రత, ఉపాధి భద్రతకు నిధుల కోసం కేంద్రాన్ని గట్టిగా అడగలేని స్థితిలో వారిద్దరూ ఉన్నారని మండిపడ్డారు. ఉపాధి నిధులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనంతరం తీస్తా సెతల్వాద్ మాట్లాడుతూ మహిళా హక్కులను హరిస్తున్న తాలిబన్ ప్రభుత్వాన్ని ఇక్కడికి ఆహ్వానించి, మీడియా సమావేశంలో కూడా మహిళా జర్నలిస్టులకు అవకాశం లేకుండా చేయడం సిగ్గు చేటన్నారు. కార్పొరేట్ చేతుల్లోఉన్న సోషల్ మీడియా ప్రజల మధ్య విద్వేషాన్ని రగిల్చే సాధనంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

76 ఏళ్ల తర్వాత కూడా పోరాటమే

ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం కూడా సమానత్వం కోసం మహిళలు పోరాడాల్సిన పరిస్థితులు దేశంలో ఉండటం విచారకరమన్నారు. సనాతనం పేరుతో ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహిళల హక్కులను హరించే పద్ధతులు అవలంభిస్తున్నాయన్నారు. సమానత్వం, మహిళా హక్కులకోసం ఐద్వా సాగిస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉద్యమాలకే కాకుండా సామాజిక పురోగతికి పెట్టింది పేరన్నారు. ఐద్వా తొలి మహాసభలోనూ అనంతపురం జిల్లా నుంచి నలుగురు సభ్యులు హాజరయ్యారని ఆమె గుర్తుచేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మనువాద విధానాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షురాలు పద్మావతి, వీకే పద్మ, లలితకళాపరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ, డాక్టర్ ప్రసూన, ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక పాల్గొన్నారు.

సమాజాన్ని కాపాడుకోవాలి

అనంతపురం టౌన్ (ఆంధ్రజ్యోతి): వామపక్షాలు, దళిత సంఘాలు, అభ్యుదయవాదులు బాధ్యతగా మెలిగి ప్రొటోఫాసిస్టు ప్రభుత్వం నుంచి సమాజాన్ని కాపాడుకోవాలని, అందుకోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముందని సామాజికవేత్త తీస్తా సెతెల్వాద్ అన్నారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం అనంతపురంలోని కామ్రేడ్ రబియాబీ ప్రాంగణంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. లలితకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ అధ్యక్షత వహించారు. ఐద్వా సీనియర్ నాయకురాలు వడ్డుపల్లి నాగమ్మ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఐద్వా పోరాటయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో తీస్తా సెతెల్వాద్ మాట్లాడుతూ, దేశంలో ప్రజా స్వేచ్ఛ, హక్కులపై దాడి జరుగుతోందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేని బీజేపీ నేడు దేశంలో పాలన సాగిస్తోందని అన్నారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ చట్టాలను తీసుకువచ్చి పౌర హక్కులను హరిస్తోందని విమర్శించారు. అస్సాం, బెంగాల్, మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడులు వర్ణనాతీతం అని అన్నారు. దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, మితవాదంవైపు ప్రయాణం చేస్తోందని అన్నారు. వాట్సాప్ ఫ్యాక్టరీ సమాజంలో పెనుప్రమాదం సృష్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ, మతోన్మాద ప్రచారాలు మన కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలను మళ్లీ బ్రిటీష్ కాలంనాటి వలస జీవన విధానంలోకి నెట్టివేస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. సభాధ్యక్షురాలు గాజుల పద్మజ మాట్లాడుతూ, అనంతపురం జిల్లా పేరుకు కరువు జిల్లా అయినా, ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పంచడంలో అగ్రస్థానంలో ఉందని అన్నారు. మహిళలకు రాజకీయం, ఆర్థిక రంగాలలో సమాన హక్కుల కోసం ఐక్యపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని అన్నారు. నేడు మహిళలు పొందుతున్న హక్కులు నాటి ఐద్వా, మహిళా సమాఖ్యల పోరాట ఫలితమేనని అన్నారు. కానీ దేశంలో నేడు కొత్తగా మహిళా సంఘాలు పుట్టుకొస్తున్నాయని, అవేవీ మహిళల కోసం, సమాజంకోసం పనిచేస్తున్న దాఖలాల్లేవని అన్నారు. 2023లో నారీశక్తి పేరుతో మహిళా రిజర్వేషన్ తెస్తామని కేంద్రం చెప్పినప్పటికీ నేటికీ తేలేదని అన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సామాజికవేత్త తీస్తా సెతెల్వాద్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

దత్తోపంత్ ఠేంగడి (వర్ధంతి)



హిందూత్వవాదిగా పేరొందిన దత్తోపంత్ బాపూరావ్ ఠేంగడి 1920 నవంబరు 10న మహారాష్ట్ర రాష్ట్రం వార్ధా జిల్లా ఆర్వి గ్రామంలో జన్మించారు. భారతీయ కార్మికసంఘ నాయకుడు, స్వదేశీ జాగరణ్ మంచ్, భారతీయ మజ్దూర్‌సంఘ్, అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), భారతీయ కిసాన్ సంఘ్‌ల వ్యవస్థాపకులు. మరణించేంతవరకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పూర్తి సమయ 'ప్రచారక్'గా పనిచేశారు. దేశ సామాజిక, ఆర్థిక జీవన స్థితులపై తనదైన ముద్రవేసి భావితరాలకు మార్గదర్శకం చేశారు. 'పద్మభూషణ్' అవార్డు ప్రకటించినా సున్నితంగా తిరస్కరించారు. నిరాడంబర జీవనం, ప్రతి అంశంపైనా సరైన అవగాహన, లోతైన, స్పష్టమైన ఆలోచనలు, దృఢ విశ్వాసం, అకుంఠిత దీక్ష ఆయన సుగుణాలు. 2004 అక్టోబరు 14న కన్నుమూశారు.

రోజర్ మూర్ (జయంతి)



జేమ్స్‌బాండ్ పాత్రతో అంతర్జాతీయగా పేరొందిన ప్రముఖ ఆంగ్ల నటుడు సర్ రోజర్ జార్జ్ మూర్ 1927 అక్టోబరు 14న లండన్‌లో జన్మించారు. 1973-85ల మధ్య 'జేమ్స్‌బాండ్' పాత్రలు ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చాయి. బ్రిటీష్, అమెరికన్ టెలివిజన్ సిరీస్‌లో నటించారు. 1991లో యునిసెఫ్ రాయబారిగా వ్యవహరించారు. 2007లో 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్' అవార్డు, జీవితసాఫల్య పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు. 2017 మే 23న కన్నుమూశారు.

నిఖిల్ బెనర్జీ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత పండిట్ నిఖిల్ రంజన్ బెనర్జీ 1931 అక్టోబరు 14న కోల్కత్తాలో జన్మించారు. మైహర్ ఘరానాలో క్లాజికల్ సితారిస్ట్‌గా పేరొందారు. అల్లావుద్దీన్ ఖాన్ వద్ద సంగీతం నేర్చుకుని 9వ యేటనే ఆలిండియా రేడియోలో ప్రదర్శనలు ఇచ్చారు. రవిశంకర్, విలాయత్‌ఖాన్‌ల తర్వాత అంతటి పేరొందిన సితారిస్ట్, ప్రత్యేకించి మెలోడీ, రిథమిక్ సంగీతంలో తనదైన ముద్రను చాటుకున్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. పలు దేశాలలో పర్యటించి కచేరీలు ప్రదర్శించారు. 1986 జనవరి 27న కన్నుమూశారు.

వేదగిరి రాంబాబు (జయంతి)



ప్రముఖ తెలుగు రచయిత వేదగిరి రాంబాబు 1952 అక్టోబరు 14న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. ఆయన కథానికలకు రేడియోద్వారా మంచి ప్రాచుర్యం లభించింది. సీరియల్ రైటర్‌గా, పబ్లిషర్‌గా రాణించారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పలు దిన పత్రికలకు వ్యాసాలు రాశారు. 'పాపం పసివాడు' దూరదర్శన్‌లో 52వారాలపాటు ప్రసారమైన సీరియల్‌కు 'బంగారు నంది అవార్డు' దక్కింది. వంద కథానికలతో 'తెలుగు కథానిక డాట్ కామ్'ను ఆరంభించారు. ఆకాశవాణిలో జింగిల్స్‌కు ప్రసార భారతి పురస్కారం, గురజాడ స్మారక పురస్కారం అందుకున్నారు. 2018 ఆగస్టు 18న కన్నుమూశారు.

శివశంకరి (పుట్టినరోజు)



ప్రముఖ తమిళ రచయిత్రి శివశంకరి 1942 అక్టోబరు 14న చెన్నైలో జన్మించారు. ఆమె నవలలు సినిమాలుగా, సీరియల్స్‌గా రూపుదిద్దుకున్నాయి. 30 నవలలు, 15 ట్రావెలాగ్స్, 150కుపైగా చిన్నకథలు రాశారు. అందులో అత్యధికంగా ఆంగ్లంలోకి, ఇతర భాషలలో అనువాదమయ్యాయి. ఆమె కొంతకాలం సిటీ బ్యాంకుకు పీఆర్‌ఓగా వ్యవహరించారు. ఇందిరాగాంధీ బయోగ్రఫీ రాశారు. కస్తూరి శ్రీనివాసన్ అవార్డు, రాజా సర్ అణ్ణామలై చెట్టియార్ అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు, తమిళ్ అన్నై అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 2024లో డాక్టర్ సి నారాయణరెడ్డి జాతీ సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు.

శశాంక్ (పుట్టినరోజు)



శశాంక్ సుబ్రమణ్య 1978 అక్టోబరు 14న కర్ణాటక రాష్ట్ర హాసన్ జిల్లా రుద్రపట్నలో జన్మించారు. వేణువాదనలో సొంతంగా రాణించారు. కర్ణాటక, హిందూస్తానీ సంగీతంలో రాణించారు. గ్రామీ అవార్డుకు ఎంపికయ్యారు. 6వ ఏట నుంచే సంగీతంలో సత్తా చాటుకున్నారు. ఆలిండియా రేడియో, బుల్లితెర చానెల్స్‌లో నేరుగా 'ఏ' గ్రేడ్ కళాకారుడిగా వచ్చారు. 50కుపైగా దేశాలలో సంగీత కచేరీలు ప్రదర్శించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, కళైమామణి, 2000లో శృంగేరీ ఆస్థాన విద్వాన్‌గా, ఇతర గౌరవాలు అందుకున్నారు. ఈయన జీవితంపై 2006లో డెస్టినేషన్ మ్యూజిక్ పేరిట బీబీసీ ప్రసారం చేసింది. 2022లో ఫ్రెంచ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్నారు.

కారహళ్లి పాలసంఘం అధ్యక్షుడిగా బాలరాజు

బంగారపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కారహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం పాలకమండలికి నూతన అధ్యక్షుడిగా బాలరాజు, ఉపాధ్యక్షురాలిగా నాగభూషణ్ ఏకగ్రీవమయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. మొత్తం 12 డైరెక్టర్ల బలం కలిగిన సంఘంలో అధ్యక్ష స్థానానికి బాలరాజు, ఉపాధ్యక్ష స్థానానికి నాగభూషణ్ మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి బాలకృష్ణ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ సంఘండైరెక్టర్‌ల ఎన్నికల వేళ గ్రామ పెద్దలు, ప్రముఖులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, అదేరీతిన ప్రస్తుత అధ్యక్ష ఎన్నికల్లో కూడా డైరెక్టర్లందరూ కలసి ఏకగ్రీవం చేశారన్నారు. అందరికీ ధన్యవాదాలన్నారు. రానున్న రోజుల్లో సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామపంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం డైరెక్టర్లు, ప్రముఖులు కలసికట్టుగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవం చేశారన్నారు. ఎన్నికలు నిర్వహిస్తే సంఘానికి నష్టమన్నారు. డెయిరీని మరింత అభివృద్ధి చేసేందుకు డైరెక్టర్లు అధ్యక్ష, ఉపాధ్యక్షులతో కలసి ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా డెయిరీ ముఖ్య కార్యనిర్వాహకులు చిన్ని వెంకటేశ్, నూతన డైరెక్టర్‌లు నాగరాజ్, లింగరాజ్, రమేశ్, నారాయణస్వామి, శేఖర్, మునిరాజు, నీలమ్మ, మంజునాథ, సుజాత, రాజేశ్వరి, డెయిరీ సిబ్బంది కృష్ణప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంఘం డైరెక్టర్లతో అధ్యక్ష, ఉపాధ్యక్షులు

విస్తరణ సమాచారం లేదు: మంత్రి



చిక్కదిబ్బూరహళ్లిలో మంత్రి సుధాకర్ తదితరులు

శిడ్లఘట్ట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార పంపిణీ, మంత్రివర్గ విస్తరణ సమాచారం తనకు లేదని చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. తాలూకా దిబ్బూరహళ్ళిలోని ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పార్టీ హైకమాండ్ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడ్డామన్నారు. ఈనెల 27న సీఎం సిద్దరామయ్య రూ.200కోట్లతో హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్‌కు శంకుస్థాపన చేయాల్సి ఉందన్నారు. అయితే సీఎం బిజీ షెడ్యూల్ వల్ల నవంబరు 8కు ఖరారైందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు డాక్టర్ ధనం జయరెడ్డి, పీఎల్‌డీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు రామచంద్ర, డీజే రామచంద్ర, జడ్పీ మాజీ సభ్యుడు మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

మూట్ కోర్ట్ పోటీల్లో పూణే రక్షితకు ఉత్తమ పురస్కారం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేత

బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సౌందర్య కళాశాలలో ఏర్పాటు చేసిన మూడో అఖిలభారత మూట్ కోర్ట్ పోటీలలో పూణేకు చెందిన సింబయోసిస్ లా కాలేజ్ విద్యార్థిని రక్షిత మహిపాల్‌కు ఉత్తమ పరిశోధకురాలి పురస్కారం దక్కింది. ఆదివారం జరిగిన పోటీలలో దేశవ్యాప్తంగా 41 కళాశాలల విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఉడుపిలోని వైకుంఠబాలిగ లా కాలేజ్ విద్యార్థి వాసుదేవ్ తిలక్‌కు, ఉత్తమ మెమోరియల్ పురస్కారాన్ని నాగ్‌పూర్ సింబయోసిస్ కళాశాలకు దక్కింది. ఈ ఏడాది జీవవైవిధ్య చట్టం, పర్యావరణంతోపాటు పలు అంశాలపై మూట్‌కోర్టు నిర్వహించారు. బెంగళూరు ఎంకేపీఎం ఆర్వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీగల్‌స్టడీస్ విద్యార్థులు విజేతగా నిలవగా, బెంగళూరు జగద్గురు లా కాలేజ్ విద్యార్థులు రన్నర్‌లుగా నిలిచారు. హైకోర్టు న్యాయమూర్తి ఈఎస్ ఇంద్రేశ్ ముగింపు సమావేశంలో పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. ప్రభుత్వ న్యాయవాదులు ఎస్ఎస్ మహేంద్ర, సతీశ్‌గౌడ, డీఎం హెగ్డేతోపాటు సీఈఓ కీర్తన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ నటుడు రాజు తాళికోటె కన్నుమూత



రాజు తాళికోటె (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు, హాస్యనటుడు రాజుతాళికోటె సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. విజయపుర జిల్లా సింధగి తాలూకా చిక్కసింధగి గ్రామానికి చెందిన రాజు తాళికోటె (62) నాటకరంగంతోపాటు సినిమాలలో ప్రముఖ నటుడిగా పేరొందారు. ఆయన అసలుపేరు రాజేసాబ్ మక్తుంసాబ్ యంకంచి. ఉడుపిలో ఓ సినిమా షూటింగ్‌లో పాల్గొన్న తర్వాత విశ్రాంతి తీసుకుంటుండగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే మణిపాల్ ఆసుపత్రికి సహచరనటులు తీసుకెళ్లారు. అప్పటికే రాజు తాళికోటె మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మనసారా, పంచరంగి, మత్తొందు మదువెనా, మైనా వంటి సినిమాలలో నటించారు. ఉత్తర కర్ణాటక నాటకమండలిలో, ధారవాడ రంగాయణ డైరెక్టర్‌గా కొనసాగారు. మద్యం మత్తులో నటించే పాత్రలతో ఆయన సుపరిచితులు.

నేటినుంచి
నిమ్మకాయలహళ్లి దర్గా గంధోత్సవం

చింతామణి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మురగమల్లా హోబళి నిమ్మకాయలహళ్ళి గ్రామంలోని హజరత్ సయ్యద్ జలాల్ ఖాకిషా మౌలాబాబా గంధోత్సవం ఈనెల 14, 15 తేదీలలో జరగనుందని దర్గా కమిటీ అధ్యక్షుడు అమీర్‌జాన్, కార్యదర్శి దాదాపీర్‌లు తెలిపారు. కమిటీ సభ్యులతో కలసి మీడియాతో మాట్లాడుతూ 14న మంగళవారం సాయంత్రం 4 గంటలకు నూరాణి గంధోత్సవం, రాత్రి 8 గంటలకు గంధోత్సవం ఉంటుందన్నారు. గ్రామపురవీధుల మీదుగా సాగి దర్గాకు చేరుకుంటుందన్నారు. గంధోత్సవాన్ని పురస్కరించుకుని ఖవాలి ఉంటుందన్నారు. మీరట్‌కు చెందిన అమీల్ ఆరీఫ్, రఖిబ్ నిజామిల ఖవ్వాలి ఆకట్టుకుంటుందన్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటలు మరవ పారుతున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గంధోత్సవానికి వచ్చే భక్తులు ఆధార్‌కార్డు తప్పనిసరి కలిగి ఉండాలని, ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించరాదని, పోలీసులు సూచించిన ప్రదేశంలోనే పార్కింగ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మహ్మద్ ఆసిఫ్, బాబాజాన్, షబ్బీర్, వలిజాన్, జబ్బార్, ఇంతియాజ్, మెహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



దర్గా కమిటీ సభ్యులతో అధ్యక్షుడు అమీర్‌జాన్ తదితరులు

బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స అందుబాటులోకి రావాలి

▸▸ ఎంపీ తేజస్విసూర్య

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ వంటి చికిత్సలు మరింత అందుబాటులోకి రావాలని ఎంపీ తేజస్వి సూర్య అభిప్రాయపడ్డారు. సంప్రద ఆసుపత్రిలో సోమవారం బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. బసవనగుడి ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య పాల్గొన్నారు. తేజస్విసూర్య మాట్లాడుతూ నగరంలో ఆరోగ్య రక్షణా రంగంలో మరో మైలురాయి సాధించినట్లు అయ్యిందన్నారు. నగరంలో అత్యాధునిక వైద్య చికిత్సలు, ఆవిష్కరణలకు బెంగళూరు కేంద్రంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య మాట్లాడుతూ క్యాన్సర్, రక్తసంబంధిత వ్యాధులకు తగిన చికిత్సలు మెరుగైతే ప్రజలకు వైద్యం మరింత చేరువ అవుతుందన్నారు. సంప్రద మెడికల్ అంకాలజీ రాధేశ్యామ్ నాయక్ మాట్లాడుతూ శోభా ట్రస్టు ద్వారా పేదలకు ఎటువంటి రుసుంలేకుండా క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సీఎస్ఆర్ నిధులు పేదలకోసం కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

ఏపీఎంసీ ఎన్నికల్లో కూటమివర్గం ముందంజ

బంగారపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకారసంఘానికి (ఏపీఎంసీ)కి ఆదివారం జరిగిన ఎన్నికల్లో 12 స్థానాలకుగాను ఎన్డీయే మైత్రి కూటమికి చెందిన ఏడుగురు, కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు. కాంగ్రెస్ మద్దతుదారులు బీ వెంకటేశ్, ఎం కృష్ణేగౌడ, బీ నారాయణస్వామి, ఏ హరీశ్, ఎం మీనాక్షిలు గెలుపొందారు. బీజేపీ, జేడీఎస్ మైత్రి కూటమి నుంచి సీతారామప్ప, సతీశ్‌కుమార్‌గౌడ, బాలచంద్ర, మార్కండేగౌడ, హెచ్‌ఆర్ శ్రీనివాస్, వీ రామయ్య, ఆర్ రమ్య గెలుపు సాధించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ మహేశ్ నూతన సభ్యులను అభినందించి మాట్లాడుతూ మైత్రికూటమితో ముందంజలో ఉందన్నారు. మాజీ ఎంపీ మునిస్వామి, మాజీ ఎమ్మెల్యే వెంకట మునియప్ప, తదితరులు ఉన్నారు.



నూతన సభ్యుల విజయోత్సాహం

డాక్టర్ థామస్ చాండీ విగ్రహావిష్కరణ

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సంస్థాపక దినోత్సవంలో భాగంగా డాక్టర్ థామస్‌చాండీ విగ్రహాన్ని శాంతినగర్ ఎమ్మెల్యే, బీడీఏ చైర్మన్ హ్యారిస్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థామస్ చాండీ అన్నివర్గాలకు వైద్యసేవలు అందుబాటులో ఉండాలని భావించారన్నారు. మగ్రత్ రోడ్డులో హాస్మాట్ ఆసుపత్రిలో ఓపీడీ విభాగాన్ని ప్రారంభించారు. ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత నిషా మిలెట్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఆసుపత్రి ఎండీ అనీషా చాండీ ఎకార్ట్ మాట్లాడుతూ సంస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పదిమంది చిన్నారులకు ఉచిత శస్త్ర చికిత్సలు చేశామన్నారు.

ద్విచక్రవాహనాలకు రుణమేళా

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పండుగల వేళ ద్విచక్రవాహనం కొనుగోలుదారులకు ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ రుణమేళాకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు సంస్థ సోమవారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ద్విచక్రవాహన కొనుగోలుదారులకు మహత్తరమైన అవకాశం కల్పించారు. నో కాస్ట్ ఇఎంఐ పేరిట రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు రుణం మొత్తంపై వడ్డీ లేకుండా రుణం సమకూరుస్తున్నట్టు తెలిపారు. 2025లో వాహనం కొనుగోలు చేసి 2026లో చెల్లించవచ్చు. రుణాల చెల్లింపులో నిబద్ధత పాటించి 35 నెలలపాటు చెల్లించాక చివరి ఇఎంఐ వడ్డీరహితంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా ఈ విధానం అమలు చేయనున్నట్టు ప్రకటించారు. పండుగల సందర్భంగా నవంబరు 30లోగా రుణం తీసుకునేవారికి వెసలుబాటు ఉంటుందన్నారు.

హత్య చేసి.. దహనం



పవన్‌కుమార్ (ఫైల్)

హిందూపురం (ఆంధ్రజ్యోతి): యువకుడిని హత్యచేసి కాల్చేసిన ఘట న శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలంలోని సంతేబిదనూరు వద్ద జరిగింది. రూరల్ సీఐ జనార్దన్ తెలిపిన మేరకు సంతేబిదునూరు సమీపంలో కల్లుదుకాణం నిర్వహించే ప్రాంతంలో కాల్చివేసిన శవం ఉందని సోమవారం తెలిసిందన్నారు. దీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. హత్యచేసి మృతుడిని గుర్తుపట్టకుండా ఉండటం కోసం ఖాళీ వాటర్ బాటిల్ వేసి నిప్పంటించినట్లు తెలిపారు. దీంతో మొహం మాత్రం కాలిపోయిందన్నారు. కల్లుదుకాణ నిర్వాహకుడిని ప్రశ్నించగా మృతుడు కర్ణాటకకు చెందినవాడని తెలిపాడు. దీంతో గౌరీబిదునూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతెడె గౌరీబిదునూరులోని హనుమంత నగర్‌కు చెందిన పవన్‌కుమార్ (28)గా గుర్తించారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని గుర్తుపట్టారు. దీనిపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

బీజేపీతో ప్రజాస్వామ్యం ఖూనీ: కాంగ్రెస్

రాయచూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటింగ్ వ్యవస్థను బీజేపీ పాలనలో పూర్తిగా భ్రష్టు పట్టించారని కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ ఎ.వసంత్ కుమార్ ఆరోపించారు. ఈ విషయంలో ఓట్ చోరీ పేరుతో రాహుల్ గాంధి చేపట్టిన ఆందోళన రోజురోజుకు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ప్రజలు ఓట్ చోరీ పై కుద్రాన్ని నిలదీయాలన్నారు. ఓట్ చోరీ ఉద్యమంలో భాగంగా డీసీసీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్సీ ఎ.వసంత్‌కుమార్, కొన్ని శాసనసభ, లోకసభ నియోజక వర్గాల్లో ఓట్ల చోరీ జరిగిందంటు రాహుల్ గాంధి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. అదే సమయంలో పూర్తి వివరాల ఆధారంగా అందచేసిన అనంతరం అప్రమత్తమైన ఈసీ ఇప్పటి వరకు నివారణ చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ప్రజలు అప్రమత్తమై ఓట్ చోరీ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసనలో కాంగ్రెస్ నాయకులు

పంటనష్టం పై సర్వే చేపట్టాలి : రైతు సంఘం

రాయచూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల పంటనష్టానికి గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కర్ణాటక రైతు సంఘం,హసిరుసేనల నాయకులు డిమాండ్ చేశారు. పంటనష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. అధికారుల తీరును నిరశిస్తు సోమవారం నగరంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతుసంఘం నాయకులు వివిధ వాణిజ్య పంటలతో పాటు అనేక రకాల పంటలు దెబ్బతినడమేగాక తోటలు, కూరగాయల పంటలు సహితం అధిక వర్షాల వల్ల దెబ్బతినగా రైతులు లక్షల్లో నష్టపోయారన్నారు. వెంటనే అధికారులు రెవెన్యూ, వ్యవసాయం, ఉద్యానవనాల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు త్వరితగతిన పరిహారం అందజేయాలన్నారు. భీమా చేసుకున్న రైతుల సొమ్మును మొత్తంగా చెల్లించేలా సంబంధిత కంపెనీలను ఆదేశించాలన్నారు. ఓపెన్ మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు ధరలు గణనీయంగా పడిపోయిన నేపథ్యంలో పత్తి కొనుగోలు సీసీఐ ద్వార కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.



ర్యాలీగా వెళుతున్న రైతుసంఘం ప్రతినిధులు

డ్రాప్ చేస్తామని...రేప్ చేశారు..!

● యువతి ఫిర్యాదుతో నిందితుల అరెస్ట్

చిక్కబళ్ళాపుర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి బస్టాండ్‌లో వేచియుండగా అదే మార్గంలో వెళ్తున్నామని డ్రాప్ చేస్తామని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన సంఘటన చిక్కబళ్ళాపుర జిల్లాలో వెలుగులోకి వచ్చింది. చిక్కబళ్ళాపురలో ఓ యువతి బస్సుకోసం వేచియుండగా సికిందర్ బాబా అనే వ్యక్తి మాటలు కలిపాడు. తాను మంచేనహళ్ళికి వెళ్తున్నానన్నారు. ప్రస్తుతం బస్సులు లేవని ఎక్కడికెళ్లాలో చెప్తే దిగబెడతానంటూ నమ్మబలికారు. దీంతో యువతి సికిందర్‌బాబా ద్విచక్రవాహనంపై వెళ్లారు. మంచేనహళ్ళికి వెళ్లే మార్గంలో ఒక కొండగుట్టల తరహాలో ఉండే నిర్జన ప్రదేశానికి వెళ్లాక అత్యాచారానికి పాల్పడ్డాడు. మంచేనహళ్ళి నుంచి చిక్కబళ్ళాపుర వైపు వెళ్తున్న మిత్రుడు జనార్ధన్ ఇదే సమయంలోనే ఫోన్ చేశాడు. అతడిని రమ్మన్నాడు. జనార్ధన్ కూడా నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లా పాడుచేశాడు. ఆ తర్వాత ఆమె ధరించిన కమ్మలను లాగేసుకున్నారు. ఊరికి సమీపంలో ఉండే ఓ పెట్రోల్‌బంకు వద్ద వదిలి వెళ్లిపోయారు. ఆమె ఏదో కష్టంలో ఉందని తెలుసుకున్న పెట్రోల్‌బంకు సిబ్బంది ధైర్యం చెప్పారు. స్థానికులు అక్కడికి చేరుకోగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిక్కబళ్ళాపుర మహిళా పోలీస్‌స్టేషన్‌కు బాధితురాలిని తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి నిందితులిద్దరినీ సోమవారం అరెస్టు చేశారు.

గుంతల రోడ్డులో ప్రయాణం కటకట

కంప్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని హొస్పేట బైపాస్ మినీ విధానసభ నుండి తిమ్మాపురం క్రాస్ వరకు గుంతలమయం కావడంతో ఈ మార్గంలో ప్రయాణం కష్టంగా మారింది. చిరుజల్లులు పడినా సరే గుంతల్లో నీరు ఆగి ప్రయాణానికి ఇబ్బందిగా మారుతోంది. గత కొన్ని నెలల క్రితమే ఈ రోజు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జేఎన్ గణేష్ భూమిపూజ చేపట్టారు. కానీ రోడ్డు పనులు మాత్రం సాగడం లేదు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంతో రోడ్డు పనులు కుంటుపడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గుంతల రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





ముందుకు సాగని ఆర్టీసీ బస్సు
గుంతలమయమైన హొస్పేట రోడ్డు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.97
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,265	84,504
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,828	82,968
నీటి నిల్వ (టీఎంసీలు)	80.66	101.66

క్యాన్సర్‌పై వీధి నాటక ప్రదర్శన

సిరుగుప్ప, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థన క్యాన్సర్ వ్యాధిపై జాగ్రత్తలు అత్యవసరమని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు సూచించారు.. తాలుకాలో సోమవారం టెక్కలకోట పట్టణంలో డిగ్రీ, ప్రభుత్వ కళాశాల ఆవరణంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, నేత్ర కళా సంఘం, ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో స్థన క్యాన్సర్ వ్యాధి నిర్మూలనపై వీధినాటక ప్రదర్శన జరిగింది. డోలు వాయించడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి మనిషి ఏదో వ్యాధి బారినపడటం సర్వ సామాన్యమని ప్రధానంగా మహిళలు క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా వుండాలని సూచించారు.

బీజేపీ పదాధికారుల ఎన్నిక

సిరుగుప్ప, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలో బీజేపీ పదాధికారులను నూతనంగా ఎన్నుకున్నట్లు పార్టీ తాలుకా అధ్యక్షుడు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన ఉపాధ్యక్షుడిగా మధుసూదన్‌శెట్టి, నాగేష్, హనుమంతరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గంగాధర, మారేష, కార్యదర్శిగా హర్షద్ జైన్, కోశాధికారిగా సిద్దన్నగౌడ, కార్యాలయం కార్యదర్శిగా సర్దార్‌తో పాటు 18 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎస్ఐ మారుతి బాధ్యతల స్వీకరణ

బళ్లారిరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహిళా స్టేషన్ ఎస్ఐగా టీకే మారుతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మారుతి 1993లో విధుల్లో చేరి 15 సంవత్సరాలు ట్రాఫిక్ పీసీగా పని చేశారు. 2019 హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొందారు. 2023 నుంచి ఎస్ఐగా పని చేశారు.



ఉద్యోగాల భర్తీ ఇంకెన్నాళ్లకు..?

● అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా నోటిఫికేషన్లు ఇవ్వరా..? ● బళ్లారిలో ధ్వజమెత్తిన నిరుద్యోగులు

బళ్లారి సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఏళ్ల గడిచినా నోటిఫికేషన్లు వేయరా, అర్హత దాటిపోతున్నా పట్టించుకోరా..అంటూ నిరుద్యోగులు ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఉద్యాగార్థుల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం వారు నగరంలో ఉద్యోగాల భర్తీ కోరుతూ నిరసన చేపట్టారు. అనంతరం జిల్లాకలెక్టర్ సిబ్బంది ద్వారా ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. నారాయణరావు పార్కు నుంచి పాత డీసీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐడీవైఓ రాష్ట్ర అధ్యక్షుడు శరణప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో గత బీజేపీ ప్రభుత్వం కొవిడ్‌ను కారణంగా చూపుతూ ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. బీజేపీ వైఫల్యాలలను ఎత్తిచూపుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేస్తాని హామీ ఇచ్చినా అది నెరవేర్చలేదన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి 2సంవత్సరాల 4నెలల తర్వాత కూడా అంతర్గత రిజర్వేషన్ల పేరుతో ఎటువంటి నియామకాలు చేపట్టలేదన్నారు. జరగలేదు. దీంతో ఉద్యోగులకు ఎదురుచూపు తప్పడం లేదన్నారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలోని 43 విభాగాల్లో 2.84,881 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. 4-5సంవత్సరాలుగా నియామకాలు లేకపోవడంతో చాలా మంది యువకులు అర్హత వయస్సును దాటిపోయారన్నారు. రాష్ట్రంలోని ప్రాథమిక మాధ్యమిక పాఠశాలల్లో 59,454 ఖాళీలు ఉన్నాయని, కళ్యాణ కర్ణాటకాలోని 6జిల్లాల్లో 21,381 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని మరోవైపు, ఆరోగ్యం గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్, రెవెన్యూ పరిపాలనతో సహా అనేక విభాగాలలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నాయన్నారు. వయోపరిమితిని సడలించాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ వ్యవస్థను తొలగించి శాశ్వత ప్రాతిపాదికన నియమించాలన్నారు. ప్రమోద్, అంజనేయులు, సుజాత, సురేశ్, గోపాల్ ,మోహన్,చ నాగరాజ్, శివశంకర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న నిరుద్యోగులు

గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

● వైద్యులు ప్రతి నెలా ఆరోగ్య వివరాలు తల్లికార్డులో నమోదు చేయాలి : జాయింట్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శంకరప్ప


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శంకరప్ప మైలారి

బళ్లారి సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌సీహెచ్ కార్యక్రమం కింద చేపట్టే ఆరోగ్య పరీక్షల్లో గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, పరీక్షలు నిర్వహించిన తర్వాత వారి స్థితిగతులపై ఆరా తీయాలని కలబురగి డివిజనల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శంకరప్ప మైలారి వైద్యులకు సూచించారు. నగరంలోని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారుల హాల్లో సోమవారం నిర్వహించిన ఆరోగ్య శాఖ ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించిన తర్వాత తల్లికార్డులో తప్పనిసరిగా నమోదు చేయాలని, ఐరన్ మాత్రలు, కాల్షియం మాత్రలు తప్పకుండా అందజేయాలన్నారు. కర్ణాటకను క్షయరహితంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలలో ఎక్కువ అవగాహన కల్పించడానికి సంస్థలతో చేతులు కలపాలలన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం కింద ఆరోగ్య పరీక్షలను టెలిమెడిసిన్‌తో పాటు విస్తృతంగా ప్రచారం చేయాలని, జిల్లా పొగాకు నియంత్రణ సెల్ కార్యక్రమాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, జిల్లా సర్జన్ డా.బసారెడ్డి, డా.అబ్దుల్లా, జిల్లా సర్వే అధికారి మరియంబి, కుటుంబ అధికారి డాక్టర్ పూర్ణిమ కత్తిమణి, జిల్లాక్షయ నిర్మూలన అధికారి డా. ఇంద్రాణి, డా.వీరేంద్రకుమార్, అర్‌సిహెచ్ అధికారి డా.హనుమంతప్ప, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఇన్‌చార్జి ఖుర్షీద్ బేగం, గిరీశ్, తాలూకా ఆరోగ్య అధికారులు, సీనియర్ ప్రాథమిక ఆరోగ్య రక్షణ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తుకారం

జిల్లా అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

● అధికారులతో సమీక్షా సమావేశంలో ఎంపీ తుకారాం

బళ్లారి సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు సహా వివిధ రకాల గ్రాంట్లు అందుబాటులోఉన్నాయని ప్రజాప్రతినిధులు ,అధికారులు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కలిసి పని చేసి జిల్లాను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని ఎంపీ తుకారాం అన్నారు. జిల్లా పంచాయితీ హాల్లో సోమవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ స్టీరింగ్ కమిటీ 'దిశ' రెండవ త్రైమాసిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అధికారులు రాజ్యాంగ ఆదర్శాలతో పాటు మానవతా దృక్పథంతో పని చేయాలని, అప్పుడే ప్రజలకు మంచి పాలన అందించగలమన్నారు. కొద్దిరోజుల్లో వరికోతలు మొదలు కానున్నాయని, వీలైనంత అధిక వరిని రైతులన ఉంచి కొనుగోలు చేయాలన్నారు. ప్రతి కార్యాలయానికి రూ. 50నుండి 60లక్షల వరకు ఖర్చవుతుంది అన్ని సౌకర్యాలతోకూడిన భవనం నిర్మించ బడుతుందని ఎంపీ తుకారం అన్నారు.నగరంలోని రేడియోపార్కు వద్ద కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన 2వ రైల్వే ఫ్లైఓవర్ పనులను తిరిగి ప్రారంభించడానికి దీపావళి తర్వాత మంత్రి సోమన్న భూమిపూజ చేస్తారన్నారు. హెచ్ఆర్ గవియప్ప సర్కిల్‌ను డాక్టర్ అంబేద్కర్ సర్కిల్‌కు అనుసంధానించే రైల్వే పనులను సమీక్షిస్తానన్నారు. సండూర్ ఎమ్మెల్యే అన్నపూర్ణ మాట్లాడుతూ సండూర్ ప్రాంతంలో ఒక రైతు ఒకే పంటను పండిస్తే మిగతా రైతులందరూ అదే పంటను పండించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై అన్నదాతకు అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా మేయర్ నందీశ్ ,జిల్లా హామీపథకాల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప, కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్, జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్, జిల్లా ఎస్పీ శోభరాణి, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బసవరాజ్, అదనపు జిల్లా కలెక్టర్ మహ్మద్ జుబేర్,ఎమ్మెల్సీ సతీశ్ ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంపీ తుకారం, కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

● ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు : ఎంపీ తుకారాం

బళ్లారి సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసిన ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఆలస్యం చేసి వారిని వేధించడం సరికాదని ఎంపీ తుకారాం అధికారులకు సూచించారు. నగరంలోని జిల్లాపంచాయతీ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన 'ప్రజా ఫిర్యాదుల స్వీకరణ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఆయన వాటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లాకలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే అందజేసిన దరఖాస్తులను తీవ్రంగా పరిగణించాలని , చట్టబద్ధంగా పరిష్కరించగల వాటిని గడువులోపు పరిష్కరించాలన్నారు. మిగిలిన వాటిని ఎంపీ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కేంద్ర నిదులతో కూడిన ఇతర ప్రాజెక్టులకు సంబందించి ప్రజల నుంచి ప్లామెంట్ సభ్యులు విచారణలను స్వీకరించారు. ఈసందర్భంగా డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ ముండరగి నాగరాజ్, మేయర్ ముల్లంగి నందీశ్, చిదానందప్ప, జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్, జడ్పీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మంజునాథ్, అధికారులు పాల్గొన్నారు.


వాల్మీకులు ఐక్యతగా జీవించాలి

● సంఘం నాయకులు వెంకోబప్ప పిలుపు


ఊరేగింపులో పాల్గొన్న వాల్మీకి నాయకులు

కంప్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : వాల్మీకి సమాజంలో ప్రతి ఒక్కరూ ఐక్యతతో ఉండాలని వాల్మీకి సమాజ ప్రముఖులు వెంకోబప్ప సూచించారు. సోమవారం దేవసముద్రం గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకోబ మాట్లాడుతూ సమాజంలో ప్రతి కుటుంబంలో పిల్లలకు విద్య కల్పించాలన్నారు. మనస్పర్థలను వదిలి అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకుని ఎఆర్థికంగా మెరుగుపడాలన్నారు. ఉదయం ముత్తయిదువులు కలశాలతో వాల్మీకి భావచిత్రపటాన్ని వాల్మీకి విగ్రహం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు ఊరేగించారు. ఊరేగింపులో కళాకారులు కోలాటాలు, వాల్మీకి మహర్షి రామలక్ష్మణ సూర్పణఖ వేషభూషణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ అధ్యక్షురాలు మాయమ్మ, వన్నూరప్ప, నాగప్ప, గాదలింగ, దుర్గయ్య, విరుపన్న, ముడియప్ప, హేమయ్య పక్కీరప్ప, కరియప్ప, వన్నూరప్ప, శివన్న, మరియప్ప పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వివాహాలు


ఉచిత వివాహాల్లో ఒక్కటైన జంటలు

కంప్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : హగరి బొమ్మనహళ్లి తాలుకా పరిధిలోని కదలబాలు గ్రామంలో శివశాంతవీర స్వాములు 103వ పుణ్యారాధన సందర్భంగా సోమవారం 13 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కే నేమ రాజు నాయక్ పాల్గొని ఒక్కటైన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలు సామూహిక వివాహాలను సద్వినియోగపరచుకోవాలన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాల వల్లే గ్రామాల్లో అభివృద్ధి శాంతి సాధ్యమవుతుందన్నారు. కదలబాలు గ్రామానికి అభివృద్ధికి రూ. పది కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. వ్యవసాయ కార్యకలాపాలకు అనుబంధంగా నీటి పారుదల ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యా రంగానికి కూడా నిధులు మంజూరు చేశామన్నారు. ఈ వివాహ కార్యక్రమాల్లో గ్రామ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

హోసూరు జోన్


కిడ్స్ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య

'కిడ్స్' పాఠశాల ప్రారంభం

హోసూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం చెన్నైలోని సచివాలయం నుంచి పరిశ్రమలు, పెట్టుబడి ప్రమోషన్ వాణిజ్య శాఖల తరపున పోచ్చంపల్లి, సిప్‌కాట్, హోసూరు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కిడ్స్ స్కూల్‌కు శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్ ప్రాంభించారు. పోచ్చంపల్లి సిప్‌కాట్, హోసూరు సిప్‌కాట్ ప్రాంతంలోని 15 చిన్నారులు కూర్చునే విధంగా గదిని రూపొందించారు. కార్యక్రమంలో హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, సిందు, రాజ్‌కుమార్, సిప్‌కాట్ అధికారులు, పరిశ్రమ ఉన్నతాదికారులు, జోనల్ కమిటీ నాయకులు, కార్పొరేషన్ కౌన్సిల్ సభ్యులు, ఓలా మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయవాది అరెస్టుకు డిమాండ్


ర్యాలీగా విడుదలై చిరుత పార్టీ కార్యకర్తలు

హోసూరు, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై షూ విసిరిన న్యాయవాదిని అరెస్టు చేయాలని విడుదలై చిరుత పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం హోసూరు రైల్వేస్టేషన్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ హోసూరు కార్పొరేషన్ జిల్లా కార్యదర్శి రామచంద్రన్ నేతృత్వం వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. కృష్ణగిరి పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి సెంథమిళ్, సోషల్ మీడియా సెంటర్ జిల్లా ఆర్గనైజర్ ఇళయరాజా, జిల్లా ఆర్గనైజర్ వినోద్‌కుమార్, పుదుకోట్టై వెంకటేశ్, మునిరాజు, మురళీతోపాటు పలువురు నిరసనలో పాల్గొన్నారు.

చిరుత సంచారంతో బెంబేలు

హోసూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని గోకుల్‌నగర్ సమీపాన వెంకటేష్ లే అవుట్ ప్రాంతంలో చిరుత సంచారంతో ప్రజలు బెంబేలు చెందుతున్నారు. ఒక కారు డ్రైవర్ సోమవారం మధ్యాహ్నం పార్కు చేసిన తన కారును తీసుకోవడానికి వెళ్లిన వేళ చిరుతపులి ఆ ప్రాంతంలోని గోడను దాటి సమీపంలోని పొదల్లోకి వెళ్లడం చూసి స్థానిక ప్రజలకు తెలిపాడు. దీంతో భయపడిన స్థానిక ప్రజలు హోసూరు అటవీశాఖ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఫారెస్ట్ గార్డ్ పార్థసారథి నేతృత్వంలోని అటవీ సిబ్బంది అక్కడికి వెళ్లి చిరుత పులి సంచారంపై పరిశీలన చేశారు. ఎక్కడ దాగి ఉందని వేలిముద్రలు ఉన్నాయా అని పరిశీలించారు. అక్కడ నిఘా కెమరాల పుటేజీలను కూడా పరిశీలించారు. గోకుల్ నగర్ ప్రాంత వాసులు, వెంకటేశ్ లే అవుట్ ప్రాంత ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

ఫ్లై ఓవర్ నుంచి జారి పడి ఇద్దరి మృతి

హోసూరు(క్రైం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫ్లై ఓవర్ నుంచి బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఇద్దరు యువకులు బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై హోసూరుకు వస్తుండగా ఫ్లైఓవర్ నుంచి పడిపోవడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కేరళకు చెందిన బావ బావమరిదులు విజయరాజ్ (28), సయోరాజ్(28)గా గుర్తించారు. సిప్‌కాట్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హోసూరులోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేసేవారని తెలుస్తోంది.

పౌర కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్, పురసభ అధ్యక్షుడు బట్టప్రసాద్

కంప్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : కంప్లి పురసభ పౌర కార్మికులకు సోమవారం పురసభ పంపుహౌస్‌లో ఎమ్మెల్యే గణేష్, పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బట్టప్రసాద్ గత పదేళ్లుగా పౌర కార్మికులకు దీపావళి పండుగను పురస్కరించుకుని దుస్తులను పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. పట్టణంలో త్వరలోనే పౌరకార్మికులకు ఇంటి స్థలాలు ఇస్తామన్నారు. పిల్లలకు విద్య కల్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్మికులు మద్యపానం మోజులో పడి అనారోగ్యం పాలు కాకుండా చూసుకోవాలని సూచించారు. తమ సంపాదనలో కాస్తయిన పొదుపు చేపట్టుకోవాలన్నారు. సుమారు 110 మందికి దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యాధికారి మల్లికార్జున, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మూకయ్యస్వామి, కౌన్సిలర్లు లడ్డు వన్నూరువలీ, వీరాంజనేయులు, మౌలా, సీఆర్ హనుమంతు, సుధాకర్, రాఘవేంద్ర, శ్రీను, షణ్ముఖప్ప, మస్తాన్, ఏపీఎంసీ అధ్యక్షులు అబిబుర్ రెహమాన్, సిద్దప్ప, ఉస్మాన్, నాగరాజు, పురసభ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీరమదకరి నాయక జయంతి



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకి సమాజ నాయకులు

బళ్లారిరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అఖండ కర్ణాటక వాల్మీకి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాసి తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్ నాయక్ నేతృత్వంలో వీరమదకరి నాయక జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. జయంతి కార్యక్రమం సందర్భంగా వాల్మీకి మదకరనాయక పట్ల పలు విషయాలు తెలియజేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముద్దమల్లయ్య న్యాయ సలహాదారుడు జయరాం, మెడికల్ మల్లికార్జున, రూపనగుడి, గోవిందు, వెంకటేష్, సుధాకర్ ఎస్పీ సర్కిల్ మల్లికార్జున, మాజీ ఏపీఎంసీ అధ్యక్షుడు ఉమేష్, యర్రగుడి మల్లికార్జున, మీడియా కోఆర్డినేటర్ ఎర్రగుడి రమేష్, మించేరు రామాంజిని ఏమన్నా పొన్నూరప్ప, కృష్ణుడు, తుకారాం, వాల్మీకి సంఘ నాయకులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి లబ్ధిదారులకు సకాలంలో నగదు చెల్లించాలి

● అధికారులకు జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి రితీశ్ కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న రితీశ్ కుమార్

రాయచూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు సకాలంలో సొమ్ము అందచేయాలని ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యం సరికాదని జిల్లా ఇంచార్జ్ కార్యదర్శి రితీశ్ కుమార్ ఆదేశించారు. సోమవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో వివిధ పథకాలు జిల్లాలో వివిధ శాఖల ద్వార చేపట్టిన పనుల పై ప్రగతి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారి, గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు నిధుల విడుదలలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవంటు స్థానిక అధికారులు చెప్పడంతో ఆశ్చర్యానికి గురైన రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి ఉన్నతాధికారులను ఫోన్ ద్వార సంప్రదించి అలాంటిదేమి లేదని నిర్ధారిస్తు స్థానిక అధికారులను మందలించారు. జిల్లా స్థాయి అధికారుల సమన్వయ లోపం వల్లే ఈ గందరగోళం నెలకొందని తక్షణమే లబ్ధిదారులకు నిధులు అందజేయాలంటు ఆదేశించారు. అదే సమయంలో జిల్లాలోని ప్రభుత్వ విద్యార్థి వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల బయోమెట్రిక్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ఇప్పటి వరకు పంటనష్టం పై సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 52 హెక్టార్‌లలో పంట నష్టం జరిగినట్లు అంచనా వేయగా ఇప్పటి వరకు 18 లక్షల హెక్టార్‌లలో సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మిగితా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా పంటల సాగుకు సంబంధించి జిల్లాలో 57 లక్షల హెక్టార్‌ల పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 54 లక్షల పంట సాగు జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు.